క్లుప్తంగా

రోడ్లపై ఆవులను వదిలితే రూ.10 వేలు జరిమానా



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో రోడ్లపై జంతువులను, ఆవులను వదిలేవారికి రూ.10 వేల జరిమానా విధిస్తామని వీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్) డాక్టర్ బీఎస్ఎస్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. వీటివల్ల ప్రమాదాలు కూడా అధికంగా జరుగుతున్నాయని, ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆవులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్ సింగ్‌నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాటిల్ షెడ్‌లో గోవుల ఆరోగ్య సంరక్షణలో ఉంటాయన్నారు. ప్రజలందరూ రోడ్లపై పశువులను వదిలిపెట్టకుండా సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, పర్యావరణ పరిరక్షణే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

పగిలిన ప్రధాన వాటర్ పైపులైను



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో మంచినీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైను పగిలిపోవడంతో మరమ్మత్తులను అధికారులు చేపట్టారు. నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్ నుంచి విజయవాడలోని వివిధ ప్రాంతాలకు శుద్ధి చేసిన మంచినీటిని పైపులైను ద్వారా పంపిణీ చేస్తారు. ఈ క్రమంలో గాంధీనగర్ వైపు వెళ్లే ప్రధాన పైపులైను కెనాల్ రోడ్డులోని వినాయకుని గుడి వద్ద పగిలి బయటకు నీరు వస్తుండటంతో నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. తక్షణం సిబ్బందితో అక్కడకు చేరుకొని మరమ్మత్తులు చేపట్టారు. దీంతో కెనాల్‌రోడ్డులోని వాహనాల రాకపోకలను ఇతర ప్రాంతాల మీదుగా మళ్లించారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని ప్రతి ఒక్క విద్యార్థి నిర్దేశించుకోవడంతో పాటు లక్ష్య సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. లంబాడీపేటలోని సన్‌ఫ్లవర్ పబ్లిక్ స్కూల్ 21వ వార్షికోత్సవ వేడుకలు గురువారం స్కూల్ ఆవరణలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ నాయకులు నమ్మి అప్పారావు, స్కూల్ అసోసియేషన్ డివిజన్ సెక్రటరీ ఖాదర్‌బాషా, హిందీ పండిత్ దేవరాజ్‌కుమార్‌లు విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి చేపట్టి అతిథులను సాదరంగా ఆహ్వానించారు. అతిథులు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రమేష్, ఉపాధ్యాయులు చిత్ర, లహరి, గొప్య పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేసిన భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కంపూడి కాలనీకి చెందిన షేక్.షంషాద్, మస్తాన్ భార్యాభర్తలు. వీరికి 16 ఏళ్ల కిందట వివాహం కాగా ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసై తనను వేధింపులకు గురి చేస్తున్నాడని షంషాద్ పలు మార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే గతంలో కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు. కొద్ది రోజులుగా వేధింపులు అధికమవ్వడంతో షంషాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కండ్రిక చెరువులో శ్మశానవాటిక నిర్మాణం

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రిక(64వ డివిజన్)లో ఇరిగేషన్‌కు సంబంధించిన పంట చెరువులో విజయవాడ నగరపాలక సంస్థ శ్మశానవాటికను నిర్మించనుంది. ఇటీవల వచ్చిన బుడమేరు వరదల నష్టానికి చెరువుల్లోని ఆక్రమణలే కారణమని.. వాటిని తొలగించాలని హైకోర్టు ఆదేశాలతో వాటిని తొలగించారు. ఇరిగేషన్ శాఖ నుంచి శ్మశానవాటిక నిర్మాణానికి అనుమతులు లేవని ఆ శాఖ ఏఈ రాజశేఖర్ తెలియజేశారు. ఆ చెరువులో శ్మశానవాటిక నిర్మించడానికి విజయవాడ నగరపాలక సంస్థ రూ.17 లక్షలు మంజూరు చేసిందని ఏఈ మాధవ్ తెలిపారు. విలేజి కండ్రిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరి శ్రీకాంత్‌ను వివరణ కోరగా చెరువులో కొంత ప్రాంతం శ్మశానవాటికగా రికార్డుల్లో ఉందన్నారు.

కిటికీలు నోచుకోని తరగతి గదులు





కిటికీలు లేని సిద్దం కృష్ణారెడ్డి ప్రాథమిక పాఠశాల అదనపు గదులు

ఏడాది కాలంగా ముందుకు సాగని పనులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని 43వ డివిజన్ ఊర్మిళా సుబ్బారావు నగర్‌లోని సిద్దం కృష్ణారెడ్డి నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తోంది. అయినా నేటికీ అవి ప్రారంభం కాలేదు. 2022వ సంవత్సరంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మన బడి నాడు–నేడు పథకంలో భాగంగా మూడు అదనపు తరగతి గదులు మంజూరు చేసింది. తరగతి గదుల నిర్మాణం శరవేగంగా జరిగింది. గతేడాది జనవరి నాటికి అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయింది. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఇతర పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. దీంతో పాఠశాలలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

నిలిచిపోయిన పనులు..

సిద్దం కృష్ణారెడ్డి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు ఉంది. ఇక్కడ ప్రస్తుతం 120 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలకు సరైన స్థలం లేకపోవడంతో అప్పట్లో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లో తరగతి గదులు నిర్మించారు. ఐదు తరగతులు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఆ గదుల్లోనే సర్దుకున్నారు. గత ప్రభుత్వం నాడు నేడు పథకంలో రెండో అంతస్తులో మూడు గదుల నిర్మాణం చేపట్టింది. వాటి నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తోంది. పూర్తయిన తరగతి గదులకు కిటీకీలు ఏర్పాటుకు ఖాళీలు వదిలారు. ఖాళీలు వదిలిన చోట కిటీకీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఈ పథకం అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం అదనపు తరగతులకు కిటీకీలు అమర్చకపోవడంతో వాటిని వినియోగించడం లేదు. పాఠశాలలో చదివే పిల్లలంతా 5 నుంచి 10 ఏళ్లలోపు వాళ్లు కావడం.. కిటికీలు లేని గదుల్లోకి వెళితే పిల్లలు పడిపోతారని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

అందుబాటులోకి తేవాలి..

మధ్యాహ్న భోజన సమయంలోనూ.. టాయిలెట్‌కు వదిలినపుడో ఆడుతూ ఎవరైనా పైఅంతస్తులోకి ప్రవేశించి ప్రమాదం జరిగితే ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. దీంతో పిల్లలను పాఠశాలకు పంపిన తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాల పైతరగతులకు సమీపంలో రెండు వైపులా విద్యుత్ తీగలు ఉన్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి అదనపు తరగతి గదులకు కిటీకీలు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అదనపు తరగతి గదులను అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు, పాఠశాలలో పనిచేసే అధ్యాపకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

నేడు స్థాయీసంఘ సమావేశం



సమావేశమైన వీఎంసీ స్థాయీసంఘం(ఫైల్)

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో జరిగే పలు అభివృద్ధి పనులపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థాయీ సంఘం సమావేశం జరగనుంది. ఇందులో మొత్తం 37 అంశాలు ఎజెండాలో పొందుపరచగా వాటిపై సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

ప్రధానాంశాలు..

- స్వచ్ఛ సర్వేక్షణ్–2020లో నగరంలోని వివిధ డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణకు 04.01.2020 నుంచి 11.01.2020 తేదీ వరకు వారం రోజుల పాటు పారిశుద్ధ్య కార్మికులను వీఎంసీ కాంట్రాక్టర్ ద్వారా నియమించుకుంది. దీనికి సంబంధించి వారం రోజులకు వర్క్ ఆర్డర్ ఇచ్చింది. కానీ 28 రోజుల పాటు జరిగినట్లు కాంట్రాక్టర్లు రూ.33.60 లక్షలు బిల్లులు అధికారులకు సమర్పించటంతో వీఎంసీ ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్థాయీసంఘానికి నివేదించారు. దీనిపై స్థాయీసంఘం చైర్మన్ మేయర్ రాయన భాగ్యలక్ష్మి రెండుసార్లు వాయిదా వేయగా మళ్లీ బిల్లు స్థాయీసంఘం ముందుకు రావటం చర్చనీయంశంగా మారింది. పనిచేయకుండానే అధికారులకు బిల్లులు సమర్పించారని, వర్క్ ఆర్డర్ లేకుండా బిల్లులు చెల్లింపులపై అప్పట్లో మేయర్ అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇదే అంశం మళ్లీ స్థాయీసంఘం దృష్టికి రావటం చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్థాయీసంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్ సైడ్ మార్జిన్ పార్కింగ్ ప్రదేశం ఏడాదిపాటు లీజుకు ఇచ్చే క్రమంలో టెండరు కమిటీ సూచన మేరకు వీఎంసీ ఎస్టేట్స్ విభాగం కాంట్రాక్టర్ల నుంచి సీల్డ్ కం ఓపెన్ టెండర్లు పిలిచింది. ఇందులో 14 మంది పాల్గొనగా స్థాయీసంఘం ఎవరికి కేటాయించాలనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- సర్కిల్–1 పరిధిలోని 43వ డివిజన్‌లో ట్రాన్స్‌పోర్టు ఆఫీస్ రోడ్డును బీటీ రోడ్డుగా వేయటానికి రూ.49.25 లక్షలు, 45వ డివిజన్‌లోని ఎస్‌కేటీ వెస్ట్ మిడోస్ అపార్టుమెంట్ రోడ్డును బీటీ రోడ్డుగా వేయటానికి రూపొందించిన అంచనాలు రూ.43.23 లక్షలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి కేటాయింపులు చేయాలని ప్రతిపాదనపై స్థాయీ సంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఘనంగా మహావీర్ జయంతి

శోభాయాత్రలో అధికంగా పాల్గొన్న జైనులు



భారీగా హాజరైన మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహావీర్ జయంతిని పురస్కరించుకొని వన్‌టౌన్‌లో జైనులు నిర్వహించిన శోభాయాత్ర గురువారం వైభవంగా జరిగింది. 2624వ భగవాన్ మహావీర్ జన్మకల్యాణిక్ వేడుకలను పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని వివిధ జైన్ ఆలయాల్లో పలు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్, శ్రీ సంభవనాథ్ రాజేంద్రసూరి జైన్ శ్వేతాంర్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లో భారీ శోభాయాత్రను నిర్వహించారు. మర్వాడీగుడి వీధిలోని ఆలయం నుంచి ప్రారంభమైన ఈ శోభయాత్రలో జైనులు వందలాదిగా పాల్గొని నృత్యాలు చేస్తూ మహావీర్‌ను స్మరించుకుంటూ ముందుకు సాగారు. వెండి రథంలో మహావీరుని విగ్రహాన్ని జైనులు ఊరేగించారు. భగవాన్‌సంభవనాథ్, పూజ్యగురు రాజేంద్రసూరి తదితరుల చిత్రపటాలను కూడా రమణీయంగా అలంకరించిన వాహనాలపై శోభాయాత్రలో ఊరేగించారు. మొయిన్‌బజార్, సామారంగంచౌక్, రమణయ్య కూల్‌డ్రింక్ షాప్ సెంటర్, హిందూహైస్కూల్, సుబ్బరామయ్యవీధి, ఆర్‌ఆర్ వీధి తదితర ప్రాంతాల మీదుగా ఈ యాత్ర సాగి.. తిరిగి జైన్ దేవాలయానికి చేరుకుంది. కార్యక్రమంలో శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబేర్ మూర్తి పూజక సంఘ్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ బోడోతరియా, ఉపాధ్యక్షులు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, కార్యదర్శి పన్నాలాల్ జైన్, సహాయక కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి డుంగరమల్ జైన్, సహకోశాధికారి రాహుల్ జైన్, అధికార ప్రతినిధి ప్రవీణ్ రాంకా, శ్రీ సంభవనాథ్ రాజేంద్రసూరి జైన్ శ్వేతాంర్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్‌సోలంకి, నరేంద్ర రాథోడ్ కోశాధికారి రికిబ్‌చంద్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

జైన ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

మహావీర్ జయంతిని పురస్కరించుకొని జైన్ దేవాలయాల్లో ఉదయం భక్తామార్ పూజ, అనంతరం శాంతి పూజ తదితర కార్యక్రమాలను జైన సంప్రదాయ పద్ధతిలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజల్లో వందలాది మంది జైనులు పాల్గొన్నారు. ముఖ్యంగా మార్వాడీగుడివీధి, పూలబావివీధిలోని ఆలయం, కాటూరివారి వీధి, కందులవారి వీధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వక్ఫ్ చట్ట సవరణ మత స్వేచ్ఛపై దాడే



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో వక్ఫ్ సవరణ చట్టం బిల్లు మత స్వేచ్ఛపై దాడేనని, ఇతర మతాలకు వర్తించని నిబంధనలు ముస్లింలకు ఎందుకని జమాఅతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు రఫీక్ అహ్మద్ ప్రశ్నించారు. ఇది ఆర్టికల్ 14, 25, 26, 28లను ఉల్లంఘిస్తుందని పేర్కొన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో లబ్బీపేటలోని తౌహీద్ మసీదులో గురువారం ముస్లిం సంఘాల కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణకు వక్ఫ్ జేఏసీ ఏర్పాటు చేశారు. రాజ్యాంగ పరిధిలో పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రఫీక్ అహ్మద్ మాట్లాడుతూ వాస్తవానికి వక్ఫ్ సవరణ బిల్లు అత్యంత ప్రమాదకరమైనదన్నారు. ఈ బిల్లు భారత రాజ్యాంగానికి విరుద్ధమని, కొత్త చట్టం ప్రకారం రాబోయే వక్ఫ్ ఆస్తులు ముస్లిం ఆధీనంలో ఉండవన్నారు.

దశలవారీగా పోరాటం..

ముస్లిం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లులో కొన్ని అభ్యంతరకర అంశాలపై సూచనలు చేశామన్నారు. ఎన్డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన చంద్రబాబు అండగా ఉంటామని చెప్పి ముస్లింలకు ద్రోహం చేశారన్నారు. బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించారని, వారు సూచించిన అంశాల ప్రస్తావనే బిల్లులో లేదని మునీర్ అహ్మద్ విచారం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో రాజ్యాంగబద్ధంగా దశలవారీగా పోరాటం చేయాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో అహిలే హదీస్ నగర అధ్యక్షుడు నసీర్ అహ్మద్ ఉమ్రి, మజ్లిస్ ఉల్ ఉలేమా – వ–ఐమా ప్రతినిధులు ముఫ్తీ యూసఫ్, ముఫ్తీ హబీబ్, నూరిషా జమాత్ ప్రతినిధులు అదిల్ షా, ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మతీన్, ప్రముఖ వైద్యులు ఎంఏ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపును నాడు వైఎస్సార్ భరించలేదా!

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంటిబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎల్‌పీజీ సిలెండర్‌పై కేంద్రం పెంచిన రూ.50లు మూలిగే నక్కపై తాటి పండు పడిన చందాన ఉందని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దగ్గర నుంచి నిత్యావసర వస్తువులతో పాటు పాలు, పెరుగు ధరలు సైతం ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఎల్‌పీజీ గ్యాస్ సిలెండర్‌పై కేంద్రం రూ.50లు పెంచటంతో బడుగు బలహీన వర్గాలపై మోయలేని భారం పడిందని అన్నారు. మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాటి యూపీఏ ప్రభుత్వం ఎల్‌పీజీ గ్యాస్ సిలెండర్‌పై రూ.50లు పెంచితే రాష్ట్రంలోని 'నా అక్క చెల్లెమ్మలపై భారం పడకూడదు' అని భావించిన ఆయన పెంచిన ఆ యాభై రూపాయలను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పి అందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఆ విధంగా సీఎం చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోలేదో ఆలోచించాలని ప్రజలను కోరారు.

కనులపండువగా పుష్పయాగ సేవ



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సీతాలక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీ కోదండరాముని ఉత్సవమూర్తులకు తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను చూసి ఉత్సవమూర్తులను రమణీయంగా అలంకరించారు. అనంతరం సుగంధ భరిత పుష్పాలతో స్వామి వారికి పుష్పయాగాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆగమ పండితులు పర్యవేక్షణలో పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం రామరక్షా స్తోత్ర పారాయణం తదితర కార్యక్రమాలను జరిపారు.

నేత్రపర్వంగా ద్వాదశ ప్రదక్షిణలు..

కోదండరాముని సన్నిధిలో గురువారం రాత్రి స్వామి వారి ద్వాదశ ప్రదక్షిణల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వామి వారికి శయనోత్సవ సేవ, ప్రథమ పవళింపు సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు.

ప్యాక్ట్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్టర్స్ సంఘం అధ్యక్షుడిగా సురేష్



పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్యాక్ట్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నూతన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు సూరపనేని సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ చైర్మన్‌గా జీవీఎస్ శర్మ, కార్యదర్శిగా ఆర్. శివకుమార్, కోశాధికారిగా పీహెచ్.రామకృష్ణను ఎన్నుకున్నామన్నారు. అనంతరం పలువురు సభ్యులతో కమిటీ నియమించామని చెప్పారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడిపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహంతిపురం జాడ పాపయ్య వీధిలో రామిశెట్టి విశాల్ సింహ(28) నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి విశాల్ సింహ ఇంటికి వెళుతుండగా వీధికుక్కలు వెంట పడ్డాయి. దీంతో విశాల్ కుక్కలను తరుముతుండగా స్థానికంగా నివాసం ఉండే గంగాధర్‌రెడ్డి, జీవన్‌లు గొడవకు దిగారు. కాగా గంగాధర్‌రెడ్డి కర్రతో విశాల్‌పై దాడి చేయగా గాయమైంది. బాధితుడిని ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం చేయించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా మెరుగైన వైద్యం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి విశాల్‌ను తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రంథాలయ సంఘం సేవలు అమోఘం



నేతల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ప్రసాద్, గ్రంథాలయ సంఘం ప్రతినిధులు

పటమట(విజయవాడతూర్పు): భారతదేశంలో మొట్టమొదటి గ్రంథాలయ సంఘం 110 సంవత్సరాల క్రితం స్థాపితమై నేటికి అదే ఆశయంతో కృషి చేయటం గొప్ప విషయమని ప్రభుత్వ ఆస్పత్రి రిటైర్డ్ వైద్యాధికారి, పుస్తక ప్రియులు డాక్టర్ డి.ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం ఆధ్వర్యంలో గురువారం సర్వోత్తమ భవనంలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక స్వచ్ఛంద సేవా సంస్థ శతాధిక సంవత్సరాలుగా మనుగడ సాగిస్తూ మరింతగా ఉత్సాహంగా పనిచేయడం అపురూపమన్నారు. సమాజంలో అందరూ విద్యావిజ్ఞానవంతులవ్వాలని తలంపుతో అయ్యంకి వెంకటరమణయ్య స్థాపించిన గ్రంథాలయ సంఘం పాతూరి నాగభూషణం, రావి శారదల నేతృత్వంలో మరింత ముందుకు సాగుతూ విజ్ఞానదాయక ఫలాలు అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గ్రంథాలయ సంఘ ఆవిర్భావ విశేషాలను సాధించిన విజయాలను వివరించారు. గ్రంథాలయ శిక్షణాల విద్యార్థులు గురుమూర్తి, శ్రీరాములు, లిఖిత ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, గ్రంథాలయ ఉద్యమంలోని ముఖ్య ఘట్టాలను తెలియజేశారు. తొలుత సంఘ స్థాపకుడు వెంకటరమణయ్యతో పాటు గాడిచెర్ల, పాతూరి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

బీజేపీ అంటే 'భారాల జనతా పార్టీ'



పంజా సెంటర్‌లో నిరసన కార్యక్రమం

వన్ టౌన్(విజయవాడపశ్చిమ): బీజేపీ పార్టీ అంటే భారాల జనతా పార్టీ అని ఎ.సి.పి.ఐ(యు) పార్టీ రాష్ట్ర సహాయ కారదర్శి ఎస్.కె ఖాదర్ భాష అన్నారు. తమ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన వంట గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక పంజా సెంటర్‌లో గ్యాస్ బండలు ఎత్తుకొని అర్ధనగ్నంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ.. 32 కోట్ల వినియోగదారులపై రూ.9,100 కోట్ల భారాన్ని కేంద్ర ప్రభుత్వం మోపిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గుతున్నా.. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం దుర్మార్గం అని పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి ఎస్డి.సలీమ్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు అనేక సార్లు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ కోట్ల రూపాయలు ప్రజలపై భారం మోపుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాచపూడి బాబురావు, ఎస్.కె.ఏ జాజ్, ఎస్.డి.వాహెద్, ఎం.డి.ఫారుక్, సమద్ అజ్మి, వానపల్లి.గంగాదర్, ఎం.డి.ఖమర్, ఎస్.డి.ఖాలిద్ మహిళలు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



కల్యాణోత్సవంలో భక్తులకు మంగళ సూత్రాలను చూపుతున్న అర్చకులు



కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణానది తీరాన ప్రత్యేకంగా నిర్మించిన శ్రీవారి నమూన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయాస్తమాన సేవల్లో భాగంగా గురువారం నిర్వహించిన శ్రీవారి కల్యాణం అత్యంత కమనీయంగా సాగింది. పెనుమాకకు చెందిన శ్రీవైష్ణవ మహాదివ్య క్షేత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. తిరుమల తరహాలో జరుగుతున్న ఉదయాస్తమాన సేవలను వీక్షించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రోజూ సాయంత్రం ఎంఎస్ రామారావు (సుందరకాండ ఫేమ్) మనుమడు ఎంఎస్ శ్రీనివాస్ తన మృదుమధుర స్వరంతో సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణ వినేందుకు వస్తున్న భక్తులతో కృష్ణాతీరం పులకించిపోతోంది. ఈ సందర్భంగా శ్రీవైష్ణవ మహాదివ్య క్షేత్ర సేవా సంఘం కార్యదర్శి దూపగుంట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు శ్రీవారి ఉదయాస్తమాన సేవలు, హనుమాన్ చాలీసా పారాయణ కొనసాగుతాయని తెలిపారు.

చెరుకూరి దీక్ష విరమణ

విజయవాడస్పోర్ట్స్: ఓల్గా ఆర్చరీ అకాడమీని అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు రెండు పర్యాయాలు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ అకాడమీ అధ్యక్షుడు, ఆర్చరీ సీనియర్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ చేస్తున్న నిరాహారదీక్ష గురువారం విరమించారు. విజయవాడ వేదికగా ఓల్గా ఆర్చరీ అకాడమి ఎంతో మంది యువతను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దింది. ఈ నేపథ్యంలో 2015, 2019 లలో విజయవాడలో జరిగిన గిడుగు వర్ధంతి వేడుకల్లో చంద్రబాబు సీఎం హోదాలో అకాడమీ అభివృద్ధికి హామీ ఇచ్చారు. దీనిని అమలు చేయాలని కోరుతూ శాప్‌కు సత్యనారాయణ లేఖ రాశాను. అమలు చేసేది లేదంటూ శాప్ నుంచి వచ్చిన లేఖతో మనస్తాపం చెందిన ఆయన ఈ నెల 7న నిరవధిక దీక్షకు దిగారు. ఈ క్రమంలో గురువారం ఉదయం సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న ఫోన్‌లో సత్యనారాయణను సంప్రదించారు. సీఎంవోకు రావాలని సూచించగా ఆయన వెళ్లి చర్చలు జరిపారు. ఈ డిమాండ్‌లను సీఎం దృష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో సమాచారం అందిస్తామని కార్యదర్శి ప్రద్యుమ్న ఇచ్చిన హామీతో దీక్షను విరమించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టినగర్ గౌతమ్ స్కూల్ ప్రాంతంలో ఉంటున్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె(23) ఉద్యోగం నిమిత్తం బయటకు వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లారు. తన నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని ఆరా తీశారు. వారి నుంచి కూడా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిటైర్డ్ ఉద్యోగి..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బ్యాంకు పనిమీద ఇంటి నుంచి బయటకు వెళ్లిన రిటైర్డ్ ఉద్యోగి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సితారా సెంటర్ లేబర్ కాలనీకి చెందిన అంబూరి ప్రసాద్(73) తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం సింగరేణి మెయిన్ వర్క్‌షాపులో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. ఈనెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు ఐఓబీ బ్యాంక్‌లో పని ఉందని చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం దాటినా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులంతా కలిసి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు కుమార్‌రాజు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.